క్లుప్తంగా

మెల్లెంపూడిలో గ్యార్మీ వేడుకలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రూరల్‌లో గురువారం రాత్రి ముస్లింల ఆధ్వర్యంలో గ్యార్మీ పండుగను వైభవంగా నిర్వహించారు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి రాజారామిరెడ్డి, వెంకట శివరామకృష్ణారెడ్డి, పఠాన్ షేక్ ఖాద్రిసికే అబ్దుల్ బాషా, శివరామ రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కేఎల్‌యూ రోడ్డులోని లైన్ల మార్పు నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కుంచనపల్లి, గుండిమెడ, కొలనుకొండ, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, ఇప్పటం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని సబ్‌సెంటర్–1 వద్ద గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 76మందికి రక్తం, మూత్రపరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యురాలు ఆష్రఫ్ తాజిన్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు రక్తహీనత నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఆకుకూరలు, క్యారెట్, బీట్రూట్‌తో పాటు ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. రక్తహీనత ద్వారా అనేక వ్యాధులు వస్తాయని వాటికి దూరంగా ఉండటానికి తగిన ఆహారం, వ్యాయామం చేస్తుండాలని చెప్పారు. కార్యక్రమంలో కొండపల్లి సుదర్శన్‌రాజు, విజయ్‌కుమార్, ఏఎస్‌ఎం లావణ్య, ఆరోగ్యసిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

తాడికొండ: తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలలో శంకర కంటి ఆసుపత్రి, రెయిన్ బో ప్రాజెక్టు సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో భాగంగా 203 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 66 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించి సిఫార్సు చేశారు. వీరికి 7 రోజుల్లోగా పాఠశాల వద్దకు వచ్చి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ విభాగం వీహెచ్‌వీ బి.గంగాధర్, ఆప్తోమెట్రిస్టులు బి.వెంకటేష్, ఆర్.వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లిరూరల్‌పరిధిలోని ప్రకాష్‌నగర్ శ్రీరామ్ మెట్రిక్యులేషన్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాల వలన కలిగే శారీరక మరియు మానసిక సమస్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాఉ. పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్.సుమలత పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కో–ఆర్డినేటర్ బి.రమేష్, ఉపాధ్యాయులు కె.విజయ, బి.సుజాత, జి.దుర్గ, కె.అంజమ్మ, బి.రత్నకుమారి, ప్రియాంక, భూ లక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎ.శకుంతల, అంగన్‌వాడీ టీచర్ బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

మేలైన విత్తనంతో మంచి దిగుబడులు

తాడేపల్లిరూరల్: వ్యవసాయ సాగులో మేలైన విత్తనం ఎంపిక చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు గాయం శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగులో విత్తనం పాత్ర చాలా ముఖ్యమైనదని, మేలైన విత్తనం ఎపిక చేసుకుని సాగు చేస్తే రైతులు మంచి దిగుబడి సాధించవచ్చని అన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా గుండిమెడ గ్రామంలో ఒక యూనిట్‌కి 25 మంది రైతులకు ఒక్కొక్క రైతుకి 25 కేజీల చొప్పున 50 శాతం రాయితీపై వరి విత్తనాలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా వ్యవసాయ శాఖ 7.5 క్వింటాళ్లు సరఫరా చేశారని అన్నారు. గుంటూరు సహ వ్యవసాయ పంచాలకులు శ్రీమతి హైమావతి విత్తన సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ప్రతి వరి రకానికి మధ్య 3 మీటర్లు దూరం పాటించి సాగు చేయాలని రైతులకు సూచనలు చేశారు. గుండిమెడ వీఏఏ వెంకటేశ్వరరావు, చిర్రావూరు వీహెచ్ ఎ.శాంతిశ్రీ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్

- ఎన్నికల వేళ నమ్మించి నట్టేట ముంచే పార్టీలు వస్తున్నాయి
- లచ్చన్నగుడిపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్



లచ్చన్నగుడిపూడిలో మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): ఎన్నికలు సమీపిస్తున్న వేళ తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించి ఆ తరువాత నట్టేట ముంచే పార్టీలు దొంగ మేనిఫెస్టోలతో ముందుకొస్తున్నాయని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో గ్రామానికి అందిన వివిధ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించి మాట్లాడారు.విలువలు, విశ్వసనీయతే అజెండాగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల కోసం ఒక్కటైన టీడీపీ, జనసేనలు పొత్తులు, ప్రజలను మభ్యపెట్టే ఎత్తుల కోసం పోటీలు పడుతూ తన్నుకుంటున్నారే తప్ప ప్రజల సమస్యలు గుర్తించి స్పష్టమైన హామీలిచ్చే పరిస్థితి ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం ఆ సొమ్మును కాపాడుకునేందుకు ప్యాకేజీలతో రాష్ట్రంలో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా వీరి భాగోతం నడుస్తుందని, ప్రజలు వారిని డిపాజిట్లు రాకుండా గల్లంతు చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నవరత్నాల పాలనతో ప్రతి ఇంటా సంక్షేమం, అభివృద్ధిని చేరువ చేసిన జగనన్నను 175కి 175 సీట్లలో గెలిపించడం ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, మాజీ సర్పంచ్ గునుసూరు సాంబిరెడ్డి, ముక్కామల సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, మాదాసు ఏసురత్నం, షేక్ బాజీ, ఈటీపీఆర్డీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, లక్ష్మీనారాయణ, నక్కా లక్ష్మణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

బోరుపాలెంలో..

తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సీనియర్ నాయకుడు కొప్పుల శేషగిరిరావు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల పోస్టరును ఆవిష్కరించి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గ్రామ అధ్యక్షుడు చనుమోలు రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి జోజి, డీజే శ్రీనివాసరావు, తోకల రాఘవ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కొనసాగింపు సీఎం జగన్‌తోనే సాధ్యం..

మేడికొండూరు: అభివృద్ధి కొనసాగి, సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అంది, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పేరేచర్ల గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగి, సంతోషంగా ఉండాలంటే వై.ఎస్.జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాలన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కో ఆర్డినేటర్ రమణారెడ్డి, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ షేక్ నాగూర్‌వలి, అబ్బాస్, గ్రామ అధ్యక్షుడు సుభాని, ఎంపీటీసీ వల్లపు శ్రీనివాసరావు, ముత్యాల బాలస్వామి, ప్రమీలా, అర్జున్ రావు, మన్నవ రాజేష్, నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ జాన్, జయరాజ్, విజయలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో...

ఫిరంగిపురం: ప్రజలందరికీ సమన్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని వేములూరిపాడు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి, లబ్ధిదారులకు అందిన వివిధ పథకాలు తెలిపే బోర్డును హబీబుల్లా, సర్పంచ్ కె.చిన్నలు ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎ.అనూరాధ, కె.ఆనంద్, ఎ.రత్నం, రఫి, ఇంచార్జి ఈవోపీఆర్డీ సత్యానంద్, సూపరింటెండెంట్ రవిబాబు, కార్యదర్శి ఏకేబాబు, మధు, వెల్ఫేర్ అసిస్టెంట్ షరీఫ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నవులూరులో...



నవులూరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

మంగళగిరి: రాష్ట్రంలో పేదరికం పోయి, సమసమాజ నిర్మాణం కావాలంటే ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని పలువురు లబ్ధిదారులు ఆకాంక్షించారు. నగర పరిధిలోని నవులూరు సచివాలయం–1 పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అధికారులు, ప్రజాప్రతినిధులు వైఎస్సార్ సీపీ పాలనలో గత నాలుగున్నర సంవత్సరాలుగా సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు అందిన పథకాల పట్టికను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి తమ జీవితాలలో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా వుంటామని తెలిపారు. మాజీ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి మాట్లాడారు. ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ షఫీ, పులి రామారావు పాల్గొన్నారు.

సంక్షేమ స్వరాజ్యం..



దుగ్గిరాలలో సంక్షేమ డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



పెనుమాకలో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద ఘననివాళి

తాడేపల్లిరూరల్: పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్‌పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు స్పష్టం చేశారు. రేవేంద్రపాడులోని సచివాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఇచ్చిన హామీలు నెరవేర్చి పేదలకు వివిధ పథకాల ద్వారా జగనన్న అందించిన లబ్ధిని వివరించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. ఈవోపీఆర్‌డీ పి.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ, గ్రామ ఉప సర్పంచ్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, జిల్లా మైనార్టీ నాయకులు షేక్ సుభాని, పలుకూరి శామ్యూల్, కొప్పుల జాకోబ్, మొండితోక వెంకట సుబ్బయ్య, మరీదు కృపాకర్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, వార్డు మెంబర్లు, వలంటీర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పెనుమాకలో...

నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సచివాలయం 1లో గురువారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సెక్రటరీ రాధాకుమారి కార్యక్రమాన్ని ప్రారంభించగా వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజులు జెండాను ఆవిష్కరించి పెనుమాక 1వ సచివాలయంలో అర్హులైన పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందిన ప్రతి ఒక్కరి ఇంటికి ధైర్యంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు తిరిగే విధంగా జగనన్న పాలన ఉందన్నారు. పెనుమాక వైఎస్సార్ సెంటర్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెనుమాక పార్టీ కన్వీనర్ దామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందిన ప్రతి ఇంటికి వెళ్లి వారి అనుమతితో వారి ఇంటికి వైఎస్సార్ సీపీ జెండాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి రూరల్ కన్వీనర్ వివేకానందరెడ్డి, బీసీ సెల్ జిల్లా నాయకుడు కత్తిక రాఘవరావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకుడు బొక్కా ప్రసన్న (నాని), బషీర్, దానం శ్రీను, వెంకట్, మేకా అంజిరెడ్డి, సుభాని,చిన్ని, వంశీ పాల్గొన్నారు.

అక్రమాలను ప్రశ్నించేదే జర్నలిజం

జర్నలిజం..జర్నలిస్టులు పుస్తకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: సమాజంలో జరుగుతున్న అక్రమాలని ప్రశ్నించి, సమాజాన్ని మార్చగలిగిన శక్తి జర్నలిజానికి వుందని, ప్రస్తుత కాలంలో జర్నలిజం రాజకీయాలతో ముడిపడడం బాధాకరమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నగరంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఈపూరి రాజారత్నం రచించిం జర్నలిజం.. జర్నలిస్టులు పరిశోధాత్మక కథనాల మొదటి భాగం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించగలిగేదే జర్నలిజం అన్నారు. జీవితంలో ప్రతి మనిషికి వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని దాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన ఎందరో గొప్ప జర్నలిస్టులు ఉన్నారని, వారందరిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, తద్వారా సమాజానికి ఎంతో మంచి జరుగుతుందన్నారు. తప్పులను ఎత్తిచూపే వారే నిజమైన మిత్రులని ఈ సమాజానికి జర్నలిస్టులు గొప్పమిత్రులు అని అభిప్రాయపడ్డారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సమాజానికి ఎళ్లవేళలా మంచి చేయగలిగేది జర్నలిస్టులు మాత్రమేనన్నారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, ఏఎన్‌యూ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ జి.అనిత, సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బాబ్జి గురువారం సందర్శించారు. డిసెంబర్‌లో కేఎల్‌యూలో జరగనున్న మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు కోసం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రపంచం మొత్తం వైద్యశాస్త్రంతో ముడిపడి ఉందని అన్నారు. దేశంలో ఉన్న విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు వైద్య, వ్యవసాయ, బయో టెక్నాలజీ వంటి పలు రంగాల పైన అవగాహన పెంచుకోవడానికి ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ డిసెంబర్ 19 నుంచి 21 వరకు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 32 దేశాల నుంచి ఆయా విభాగాలకు చెందిన నిపుణులు హాజరువుతారని అన్నారు. వర్సిటీ ప్రొ.చాన్స్‌లర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, వ్యవసాయ విభాగం డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, లైఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు పాల్గొన్నారు.

ఆటస్థలం ప్రారంభం

ఫిరంగిపురం: వేములూరిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటస్థలాన్ని సర్పంచ్ కె.చిన్న, వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లాలు ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ చెరువుకు సంబంధించిన నాలుగు ఎకరాలు స్థానిక ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఆటస్థలంగా మార్చామన్నారు. ఎంపీటీసీలు ఎ.అనూరాధ, ఎ.రత్నం పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



నూతక్కిలో గ్రంథాలయ ఉద్యమ కర్తల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మంగళగిరి: జాతీయ గ్రంథాలయ 56వ జాతీయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం మూడవ రోజు మంగళగిరి శాఖ గ్రంథాలయంతో పాటు నూతక్కి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకర్తలు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, ప్రాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తత్వ పోటీలు నిర్వహించి అతిథులు గ్రంథాలయాల విశిష్టతలను వివరించారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయ సహాయ సంచాలకులు సీహెచ్ దీక్షితులు, సీకే జూనియర్ కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎన్.ఆనందరావు, గ్రంథాలయ అధికారి ఎస్.ఆరోగ్యం, నూతక్కి జెడ్పీ స్కూలు ఇన్‌ఛార్జి హెచ్ఎం జేమ్స్ వాణి, లైబ్రేరియన్ ఎస్.నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం మ్యూజికల్ చైర్స్‌పోటీలు నిర్వహించారు. ఈపోటీలకు సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్, తెలుగుమీడియం, అల్లంవారిపాలెం జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఝాన్సీ గ్రంథాలయ కార్యక్రమాలను పరిశీలించారు. పుస్తకపఠనం కోసం ఏర్పాటు చేసి ప్రదర్శనశాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తి, సైదాసాహెబ్‌లు పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ: గ్రంథాలయ పఠనం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రైతు సంఘం నాయకుడు చింతల భాస్కరరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తాడికొండ శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులైన అయ్యంకి వెంకట రమణయ్య, డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణంల ఫొటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి, నాగేశ్వరరావు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. తుళ్లూరు శాఖ గ్రంథాలయంలో బాల బాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విద్యుత్ శాఖ ఉద్యోగి చిరంజీవి పాల్గొని జడ్జిగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. గ్రంథాలయాధికారి గిరిధర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన దేశభక్తి గీతాల పోటీలు..

తాడేపల్లిరూరల్: 56వ జాతీయ గ్రంథాయల వారోత్సవాల్లో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాషా మాట్లాడుతూ సబ్ జూనియర్స్ విభాగంలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించామని న్యాయ నిర్ణేతలుగా శ్రీమతి వి.భాగ్యలక్ష్మి, పి.దయమంతిలు వ్యవహరించారని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 70మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

18న సీజీఆర్‌ఎఫ్ విద్యుత్ అదాలత్

రాయపూడి(తాడికొండ): ఈ నెల 18న రాయపూడి సీఆర్‌డీఏ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో కన్స్యూమర్ రెడ్రస్సల్ ఫోరం విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీఆర్డీయే సర్కిల్ ఎస్ఈ పత్తిపాటి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు ఎ.సునీత పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వినియోగదారులు తమ ఫిర్యాదును రాత పూర్వకంగా సర్వీస్, కనెక్షన్ నంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్‌తో ఇచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

రేవేంద్రపాడు ఉప సర్పంచ్‌గా బాజీ ఏకగ్రీవం



ఉప సర్పంచ్ షేక్ బాజీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో గురువారం ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. వైఎస్సార్ సీపీకి చెందిన షేక్ బాజీని సభ్యులందరు ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన మాధవి దుర్గ అనారోగ్యం కారణంవల్ల రాజీనామా చేయడంతో షేక్ బాజీని అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలుకూరి మేరమ్మ, మాజీ ఎంపీపీ చల్లపల్లి భారతి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కేశంనేని శ్రీధర్, సయ్యద్ నాగూర్ బాషా, షేక్ బికారీ, షేక్ ఖాదర్, జాన్ బాషా, మునాఫ్, షేక్ హనీఫ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



గుడిమెట్ల సుజాతకు నియామకపత్రం అందజేస్తున్న ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు

దామరపల్లి ఉప సర్పంచ్‌గా గుడిమెట్ల సుజాత..

దామరపల్లి(తాడికొండ): తాడికొండ మండలం దామరపల్లి గ్రామ ఉప సర్పంచ్ 5వ వార్డు సభ్యురాలైన గుడిమెట్ల సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం దామరపల్లి గ్రామ పంచాయతీ ఎన్నిక ప్రక్రియను నిర్వహించగా సభ్యులందరూ ఆమోదం తెలపడంతో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎన్నికల నిర్వహణాధికారి, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వర్లు ప్రకటించారు. అనంతరం సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, ఈఓపీఆర్డీల చేతుల మీదుగా ఉప సర్పంచ్‌కు ఎన్నిక నియామక పత్రం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు తాటి తులసీరామ్, పలువురు వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నాగరాజు



మంగళగిరి: మండల స్థాయి సివిల్ సప్లయిస్ విజిలెన్స్ కమిటీ సభ్యులను నియమిస్తూ జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మండల స్థాయి విజిలెన్స్ కమిటీకి తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ చైర్మన్‌గానూ, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ దుర్గారావు కన్వీనర్‌గానూ వ్యవహరించనున్నారు. కమిటీ సభ్యులుగా 17 మందిని నియమించగా అందులో సీనియర్ జర్నలిస్ట్, ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జి నాగరాజు నాయుడుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)కి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) ఆపరేటర్లు, రేషన్ డీలర్లు సమన్వయంతో పనిచేసి పేదలకు సకాలంలో ఇంటింటా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా చూస్తామని తెలిపారు.

పేదరిక నిర్మూలనే విజయపథం యాత్ర లక్ష్యం

విశ్రాంత ఐఏఎస్ జి.విజయ్‌కుమార్

మంగళగిరి: దేశంలోనూ, రాష్ట్రంలోనూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఐక్యత విజయపథం గౌరవ యాత్ర చేపట్టినట్లు రిటైర్డు ఐఏఎస్ జి విజయ్‌కుమార్ అన్నారు. జూలై 23వ తేదీన తడలో ప్రారంభమైన ఐక్యత విజయపథం గౌరవ యాత్ర గురువారం 84వ రోజు మంగళగిరికి చేరుకుంది. నగరంలోని చిల్లపల్లి కళ్యాణ మండపంలో మధ్యాహ్న భోజనానంతరం సాయంత్రం నాలుగు గంటలకు యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా రిటైర్డు ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనుల ఆకాంక్షను నెరవేర్చడానికి ఐక్యత విజయపథం గౌరవ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా, సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా శాశ్వత ఉపాధికోసం, స్వావలంభన కోసం యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే ఐదు జిల్లాల్లో యాత్రను పూర్తి చేసుకుని శనివారం తాడేపల్లి మీదుగా కృష్ణాజిల్లాకు చేరుకుంటుందన్నారు. పేదలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడమే యాత్ర లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు గడచినా నేటికీ 70 శాతం మంది ప్రజలు పేదరికంతో జీవిస్తున్నారని, నిర్దిష్ట ప్రణాళిక ద్వారా పేదరికాన్ని నిర్మూలించడమే ఐక్యత విజయపథం గౌరవయాత్ర ధ్యేయమన్నారు.